తుపాన్‌గా మారనుంది

నేటి మధ్యాహ్నం కారైకల్- మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం


అల్లకల్లోలంగా తూపిలిపాలెం సముద్రతీరం

● అప్రమత్తంగా అధికార యంత్రాంగం

తిరుపతి/సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారనుంది. ఈ ఫెంగల్ తుపాన్ శుక్రవారం మధ్నాహ్నం నుంచి గంటకు 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయుదిశగా కదులుతూ అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాన్ కదలికలను, దీని తీవ్రత ఏ ప్రాంతాల్లో అధికంగా ఉంటుందనేది ముందస్తుగా ఇస్రో ఉపగ్రహాల ద్వారా సమగ్ర సమచారం సేకరించి ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేస్తున్నారు. షార్ కేంద్రంలో రాడార్ ద్వారా కూడా తుపాన్ కదలికలను పసిగడుతున్నారు. ఇటీవల ఇస్రో ప్రయోగించిన ఈవోఎస్-08, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల ద్వారా తుపాన్ తీవ్రత, దిశ మార్పు, సముద్రంలో వీచే గాలులు, అక్కడ వాతావవరణ పరిస్థితులను ఇస్రో సేకరించి ప్రభుత్వానికి చేరవేస్తున్నట్లు సీనియర్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ తుపాన్ ప్రస్తుతం చెన్నైకి ఆగ్నేయంగా 380 కిలోమీటర్ల దూరంలో, పుదుచ్చేరికి తూర్పు ఆగ్నేయంగా 340 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఇది బలపడి వాయువ్య దిశగా పయనించి శనివారం మధ్యాహ్న సమయంలో పుదుచ్చేరి దగ్గర కారైకల్-మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. దీని ప్రభావంతో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్ష సూచనలు ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టులో మూడో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

సముద్ర తీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంది. వర్షపాతం లేకున్నా ఈ మండలాల పరిధిలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. సాయంత్రం నుంచీ అలల ఉధృతి పెరిగింది. పది అడుగుల ఎత్తున అలలు ఎగసి పడుతున్నాయి. సముద్ర తీర ప్రాంత మండలాలపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదంటూ అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. దీంతో నాలుగైదు రోజులుగా మత్స్యకారులు వేటకు వెళ్ళడం లేదు. సూళ్ళూరుపేట, తడ మండలాల్లో పులికాట్ సరస్సులోనూ మత్స్యకారులు వేట నిలిపివేశారు. తడ, సూళ్ళూరుపేట, చిట్టమూరు మండలాల్లో మాత్రం శుక్రవారం రాత్రి 8 గంటల నుంచీ మోస్తరు వర్షం కురుస్తోంది.



మల్లిమడుగుకు చేరుతున్న నీరు

రేణిగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయరుకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరుతోంది. దీంతో నీటి మట్టం పెరిగింది. ఈ రిజర్వాయరు సామర్థ్యం 0.181 టీఎంసీ కాగా ప్రస్తుతం నీటి మట్టం 0.168కు చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకుతోడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో రాత్రికి డ్యాం నిండే అవకాశముందని డీఈ చంద్రమౌళి అభిప్రాయపడ్డారు. డ్యామ్ నిండితే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామన్నారు.

చిరుజల్లులు.. చలి గాలులు

జిల్లాలో శుక్రవారం అప్పుడప్పుడు చిరుజల్లులు తప్ప వర్షమేమీ కురవ లేదు. చలి గాలులు మాత్రం జనాన్ని వణికించాయి. అయినా వాతావరణ శాఖ హెచ్చరికల నేపధ్యంలో ముందస్తు జాగ్రత్తలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వుంది. జిల్లాలో భారీ నుంచీ అతి భారీ వర్షాలు కురుస్తాయని, మెరుపు వరదలు కూడా సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించడంతో తీర ప్రాంతంలోని మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూములు ఏర్పాటయ్యాయి. ఇక, జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సగటు కనిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీలుగా నమోదైంది.



వెంకన్న సేవలో కీర్తి

సినీ కథానాయిక కీర్తి సురేష్ శుక్రవారం ఉదయం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వచ్చే నెలలో పెళ్లాడనున్న నేపథ్యంలో స్వామివారి ఆశీస్సుల కోసం వచ్చానని చెప్పారు.



వీణాపాణిగా..

వీణ చేతపట్టి.. హంస వాహనంపై పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఊరేగారు. తిరుమాడవీధుల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

- కార్తీక బ్రహ్మోత్సవ విశేషాలు 8వ పేజీలో

ఆధార్ లింక్ కోసం..

● హెడ్‌పోస్టాఫీసుకు బారులు తీరిన జనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు లబ్ధిదారులకు నేరుగా అందాలంటే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలి. దీనికి శనివారం చివరి రోజు. శుక్రవారం తిరుపతిలోని హెడ్ పోస్టాఫీసుకు జనం తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆడబిడ్డ నిధి రూపంలో రూ.1500 లబ్ధి పొందుతామని భావించిన ప్రజలు ఆధార్ తీసుకొని తపాలా కార్యాలయాలకు వెళ్లారు. కానీ, బ్యాంకు ఖాతాల్లేనివారు, ఉన్నా ఆధార్‌తో అనుసంధానం చేయక ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్న వారే పోస్టాఫీసులో కొత్తగా ఖాతా తెరచుకోవాలని అధికారులు చెబుతున్నారు.

- తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి



సీఎం.. తిరుగు ప్రయాణం

● మార్గమధ్యంలో క్రీడాకారుల కృతజ్ఞతాపూర్వక స్వాగతం


విమానాశ్రయం వద్ద సీఎంకు కలెక్టర్, ఇతర అధికారుల వీడ్కోలు

తిరుపతి/రేణిగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోదరుడి కర్మక్రియల కోసం బుధవారం నుంచీ స్వగ్రామమైన నారావారిపల్లిలో గడిపిన సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం రాజధానికి తిరుగు ప్రయాణమయ్యారు. నారావారిపల్లెలో ఉదయం పలువురు పార్టీ నేతలు కలిశారు. నాయకులతో మాట్లాడిన సీఎం వారి నుంచీ విజ్ఞాపనలు స్వీకరించారు. ఆపై 10.05 గంటలకు నివాసం నుంచీ తిరుగు ప్రయాణమయ్యారు. ఇటీవల క్రీడా రంగానికి ప్రోత్సాహాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ఆధ్వర్యంలో శ్రీనివాసమంగాపురం నుంచీ తిరుపతి రూరల్ కాలూరు వరకూ రెండు కిలోమీటర్లు వేలాది మంది క్రీడాకారులు రోడ్డుకు ఇరువైపులా నిలుచుని 'థ్యాంక్యూ సీఎం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి కృతజ్ఞతలు తెలిపారు. వీరిని గమనించిన సీఎం చంద్రబాబు కాన్వాయ్ ఆపి శాప్ ఛైర్మన్ రవి నాయుడుతో కలసి వాహనం ఫుట్‌బోర్డుపై నిలుచుని వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

విమానాశ్రయంలో సాదర వీడ్కోలు

ఉదయం 10.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎం చంద్రబాబు 11.05 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ బయల్దేరి వెళ్ళారు. విమానాశ్రయంలో ఆయనకు ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, బొజ్జల సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, గాలి భానుప్రకాష్, నెలవల విజయశ్రీ, మురళీ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, ఏపీ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర వర్మ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, డీఐజీ షిమోషి బాజ్‌పేయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సాల్, తిరుపతి కమిషనర్ మౌర్య తదితరులు వీడ్కోలు పలికారు.

జిల్లాకు ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగిన 66 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో జిల్లాకు ముగ్గురు అధికారులు రానున్నారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న సుధారాణి జీఎన్ఎస్ఎస్ (గాలేరు-నగరి-సుజలస్రవంతి) యూనిట్-1కు.. కలెక్టరేట్‌లోని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌కు రోజ్‌మాండ్.. టీటీడీలోని భూసేకరణ విభాగానికి (ఎల్ఎ)వెలిగొండ స్పెషల్ కలెక్టర్ పీఏగా పనిచేస్తున్న సువర్ణమ్మను నియమించారు. అయితే, శ్రీవారి దర్శనానికి వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండే జిల్లాకు.. కీలకమైన ప్రొటోకాల్ పోస్టులకు ఎవరినీ నియమించలేదు. ప్రొటోకాల్ పరిధిలోని రెండు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులు కొన్నాళ్లుగా ఖాళీగా ఉన్నాయి.


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

చెన్నై వెళ్ళిన మంత్రి నారా లోకేశ్

చంద్రగిరి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): గురువారం రాత్రి నారావారిపల్లెలోనే బస చేసిన మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉదయం 8 గంటలకు నివాసం నుంచీ వెలుపలికి వచ్చి ప్రజలను, నాయకులను కలుసుకున్నారు. ప్రజల నుంచీ అర్జీలు స్వీకరించారు. అనంతరం 8.30 గంటలకు బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని.. చెన్నై వెళ్ళారు. మధ్యాహ్నం 12 గంటలకు సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, రామ్మూర్తినాయుడు సతీమణి నారా ఇందిర, కుమారులు నారా గిరీష్, నారారోహిత్ నారావారిపల్లె నుంచి తిరుగు పయనమయ్యారు. నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ ఛైర్మన్ రవినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నేతలు కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, గౌస్ బాషా, బాలకృష్ణమూర్తి, గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.

తిరుమలలో చిరుజల్లులు



తిరుమలలో శుక్రవారం కూడా జల్లులు కురిశాయి. గత రెండు రోజులుగా చిరుజల్లులు కురవడంతో పాటు దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేస్తోంది. శుక్రవారం పొగమంచు లేకపోయినప్పటికీ వేకువజాము నుంచి రాత్రి వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. చిన్నపాటి చినుకులే కావడంతో భక్తులు కూడా యథావిధిగా దర్శనం చేసుకుని వారివారి గమ్యస్థానాలకు వెళ్లారు. తిరుమలలో తీవ్రమైన చలి భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలు ఆగచాట్లు పడుతున్నారు. పుష్కరిణిలో స్నానాలు చేసే వారితో పాటు సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, శ్రీవారిమెట్టు వద్దకు వెళ్లేవారి సంఖ్య తగ్గింది. వాతావరణం మార్పుతో చాలా మంది దర్శనం పూర్తికాగానే తిరుమల నుంచి తిరుగు ప్రయాణమవుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

లక్ష్మీనరసింహస్వామికి వైభవంగా ప్రత్యేకాభిషేకం

తిరుమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోని కాలినడకమార్గంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి శుక్రవారం ప్రత్యేక అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ప్రతి ఏటా ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపుతో విశేషంగా అభిషేకం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొని భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. ఇటీవల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఇనుప వంతెనను పరిశీలించారు.

హోటల్ గ్రాండ్ రిడ్జ్‌లో క్రిస్మస్ సంబరాలు



ఫార్చ్యూన్ సెలెక్ట్ గ్రాండ్ రిడ్జ్ హోటల్లో క్రిస్మస్ సంబరాలు

తిరుచానూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫార్చ్యూన్ సెలెక్ట్ గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో శుక్రవారం 12వ వార్షిక క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుకను జరుపుకున్నారు. ఈ సంప్రదాయం పండుగ సీజన్‌ను ప్రారంభిస్తుందని జనరల్ మేనేజర్ సిద్ధార్థశర్మ అన్నారు. రాబోయే క్రిస్మస్ పండుగ అతిథులు, ఉద్యోగులను ఒకచోట చేరుస్తుందన్నారు.

విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రతిభావంతుల క్రీడా పోటీలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు.

యాదవ భవన నిర్మాణానికి ఐక్యంగా సాగుదాం

తిరుపతి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదవ భవన నిర్మాణానికి ఆ కులస్థులందరూ ఐక్యంగా సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్ అన్నారు. సామవాయి రోడ్డు సమీపంలో రూ.8కోట్లతో నిర్మిస్తున్న యాదవభవన్‌ను ఆయన శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, కట్ట జయరామ్‌యాదవ్, హేమలత, తులసి, భరణి, ముని మేఘనాథం, రమేష్, అన్నా రామచంద్రయ్య, కృష్ణయాదవ్, చెంగయ్య, శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

సింధూరం అలంకరణలో శివయ్య దర్శనం

చంద్రగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో వెలసిన శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో స్వామివారు సింధూరం అలంకరణలో దర్శనమిచ్చారు. శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి, సింధూరం అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ శైవాంగ పండితులు శివకుమార్ శర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏనుగుల విధ్వంసం



ఏనుగులు విరిచేసిన మామిడి చెట్లు

భాకరాపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో వారం రోజులుగా ఏనుగుల విధ్వంసం కొనసాగుతోంది. గురువారం రాత్రి చిట్టేచర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజగోపాల్ రెడ్డి ధాన్యం ఆరబెట్టడానికి బండపై కుప్పగా పోసి ఉంచారు. గురువారం రాత్రి ఆ వైపుగా వచ్చిన ఏనుగుల గుంపు సుమారు 50 బస్తాల ధాన్యాన్ని తినేశాయి. అలాగే గంగిరెడ్డికి చెందిన మామిడి చెట్లు విరిచేసి, టమోటా పంటను తొక్కివేశాయి. భరతనాథరెడ్డికి చెందిన కొబ్బరి చెట్లను విరిచేశాయి. నష్టపోయిన పంటలను ఉద్యాన శాఖాధికారిణి శివకుమారి శుక్రవారం పరిశీలించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆమె తెలిపారు.

రామానుజర్ ఆదికేశవ పెరుమాళ్ ఆలయంలో లోకేశ్



ఆలయంలోకి వెళ్తున్న లోకేశ్

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఉన్నతవిద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీపెరంబుదూర్‌లో వున్న రామానుజర్ ఆదికేశవ పెరుమాళ్ ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించాక స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన విమానంలో హైదరాబాద్ బయలుదేరివెళ్లారు. ఆలయంవద్ద లోకేశ్‌కు ఆలయ నిర్వాహకులు, చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ నేతలు మన్నూరు చలపతి, మన్నెం రవిబాబు, రాజేష్, జనార్దన్, ఉమాపతి, మోహన్ స్వాగతం పలికారు.

వృద్ధురాలు అదృశ్యం



పద్మావతమ్మ (ఫైల్ ఫొటో)

పాకాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలు నాలుగు రోజులుగా కనబడుటలేదని మనవడు జయచంద్ర నాయుడు పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయతీ రామిరెడ్డిగారిఇండ్లు (ఒంటిల్లు)లో నివాసముంటున్న బి.పద్మావతమ్మ (91) 26వ తేది మంగళవారం నుంచి కనబడటం లేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పాకాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తిరుమలలో అస్వస్థతకు గురైన వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వద్ధుడి మృతదేహం

తిరుమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 13వ తేదీన తీవ్ర అస్వస్థతకు గురైన ఓ వృద్ధుడు తిరుపతిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం వద్ద సుమారు 70 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ఈనెల 13వ తేదీన ఎలాంటి కదలికలు లేకుండా ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు, వైద్యులకు సమాచారమిచ్చారు. దీంతో అతడిని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆ వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. మృతుడు చెన్నైకు సమీపంలోని తాంబరంకు చెందిన జయగోపాల్ అని, గత మూడు నెలలుగా తిరుమలలోనే ఉంటూ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నట్టు కొందరు స్థానికులు పోలీసులకు తెలిపారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96772 నెంబరు తెలియజేయాలని టూటౌన్ పోలీసులు ఓ ప్రకటన ద్వారా కోరారు.

తిరుమల నడకమార్గంలో తెలంగాణ భక్తుడి మృతి



మృతదేహాన్ని తీసుకొస్తున్న వైద్య సిబ్బంది

తిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల నడకమార్గంలో శుక్రవారం తెలంగాణకు చెందిన భక్తుడు మృతి చెందారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన గడ్డం సమ్మారావు(54) కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకున్నారు. మొక్కు ఉన్న నేపథ్యంలో శ్రీవారిమెట్టుమార్గంలో తిరుమలకు కాలినడక ప్రారంభించారు. 500వ మెట్టు వద్దకు రాగానే ఛాతీ నొప్పి అంటూ సమ్మారావు కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు, ఇతర భక్తులు పైకి లేపేందుకు ఎంత ప్రయత్నించినా లేవలేదు. గుండెపోటుతో మృతిచెందినట్టు గుర్తించారు. అనంతరం పోలీసుల సహాయంతో మృతదేహాన్ని తిరుపతికి.. ఇక్కడి నుంచి వాహనంలో సొంతూరుకు తీసుకెళ్లారు.

ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ మెటీరియల్ సిద్ధం

తిరుపతి(విద్య), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్స్ సిద్ధమయ్యాయని ఐఐటీ-జేఈఈ-నీట్ ఫోరం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 6 నుంచి 10వ తరగతులు చదువుతున్న విద్యార్థుల కోసం ఈ మెటీరియల్‌ను సిద్ధం చేసినట్లు వెల్లడించింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్ డిజిటల్ మొబైల్ వర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చని పేర్కొంది. మరింత సమాచారం కోసం ఐఐటీఎఫ్, ఎంఈడీఎఫ్ అని టైప్‌చేసి 9849016661కు వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయాలని సూచించింది.

కరోనాలో నష్టపోయిన కార్మికులకు పరిహారం

తిరుపతి(సెంట్రల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో తిరుపతి కోచింగ్ డిపోలో పనిచేసి అధికారుల నిర్లక్ష్యానికి గురై లక్షల రూపాయలు నష్టపోయిన 24 మంది కార్మికులకు తమ పోరాటం వల్ల నష్టపరిహారం వచ్చిందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిజన్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు తెలిపారు. 2020లో కరోనా లాక్ డౌన్ సమయంలో రైళ్ల రాకపోకలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసిందన్నారు. ఆ సమయంలో తిరుపతి రైల్వే స్టేషన్‌లోని కోచ్ అండ్ వ్యాగన్ విభాగంలో 24 మంది కార్మికులు కరోనా కోచ్‌లు, పాల ట్యాంకర్లు మరమ్మతులు చేసి రవాణాకు సిద్ధం చేశారని వివరించారు. అప్పటి నిబంధనల మేరకు రోజు మార్చి రోజు సెలవులు ఇచ్చారని తెలిపారు. ఆడిట్ విభాగం అధికారులు కార్మికులకిచ్చిన సెలవులను రద్దుచేసి, వేతనాల్లో కోతవిధించారని వివరించారు. ఈ సమస్యపై డివిజన్, జోనల్ స్థాయి అధికారులతో పలుమార్లు చర్చించడంతో పరిష్కారం లభించిదన్నారు. నష్టపోయిన కార్మికులకు నవంబరు నెల వేతనంలో కలిపి పరిహారం అందుతోందని సుదర్శన్‌రాజు వెల్లడించారు.

కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక శోభ



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తిరుచానూరు ఆస్థాన మండపంలో ఎస్వీ నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళధ్వని, ఎస్వీ వేద అధ్యయన సంస్థ పండితులచే చతుర్వేద పారాయణం నిర్వహించారు. తిరుపతికి చెందిన చక్రవర్తి రాఘవన్ ధార్మికోపన్యాసం, భువనేశ్వరి బృందంచే భక్తి సంగీత కార్యక్రమం చేపట్టారు. వరలక్ష్మి బృందంచే హరికథా పారాయణం, సుశీల బృందంచే అన్నమయ్య విన్నపాలు, ఊంజల్ సేవలో ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు శబరి గిరీష్ బృందం అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. మహతి కళాక్షేత్రంలో తిరుపూర్‌కు చెందిన నరసింహారావు బృందం భక్తి రంజని కార్యక్రమం, అన్నమాచార్య కళామందిరంలో కుమారి హారతి, మధుసూదనరావు బృందం, రామచంద్ర పుష్కరిణి వద్ద కొండలరావు బృందంచే భక్తి, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. శిల్పారామంలో పప్పీ బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన చేపట్టారు. ఈ కళా ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి

పద్మావతిదేవికి కళారాధన

● వాహనసేవల్లో ప్రతిధ్వనించిన కళావిన్యాసాలు







తిరుచానూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి వాహన సేవల్లో వివిధ కళాబృందాలు తమ నైపుణ్యంతో అమ్మవారికి నీరాజనం పలుకుతున్నాయి. వాహనసేవల ముందు సాంప్రదాయ కోలాటాలు, చెక్కభజన బృందాలు, తప్పెటగుళ్లు, శాస్త్రీయ నృత్యం, చిన్నపిల్లల నృత్యాలు, వివిధ దేవతా మూర్తుల వేషధారణతో భక్తులను ఆకట్టుకుంటూ అమ్మవారికి పద్మావతీ.. పాహిమాం అంటూ ప్రణమిల్లుతున్నారు. జీయర్ స్వాముల దివ్యప్రబంధ ప్రవచనం భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన రేకెత్తిస్తుండగా... పండితుల వేదమంత్రోచ్చరణలు తిరుచానూరు పురవీధుల్లో ప్రతిధ్వనించాయి.

హంసవాహన సేవలో

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన శుక్రవారం రాత్రి హంస వాహన సేవలో 12 కళాబృందాలకు చెందిన 256 మంది కళాకారులు తమ నాట్య ప్రావీణ్యాన్ని ప్రదర్శించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన హంస లక్ష్ములు, నెమలినాట్యం, కైల్‌కుట్టికాళి, జానపద నృత్యం, గరగల్లు, కోలాటం వంటి పలు ఆసక్తికరమైన నృత్యాలు భక్తులకు కనువిందు చేశాయి.

వైభవంగా ఊంజల్ సేవ



తిరుచానూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆస్థాన మండపంలో అమ్మవారికి నేత్రపర్వంగా శుక్రవారం సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ



తిరుచానూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఉదయం జరిగిన పెద్దశేష వాహనసేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. కావ్య ప్రబంధాలతో ఆధ్యాత్మిక కథలు, బేతాళ పంచవిశతి, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవనచరిత్ర, ఉపదేశత్రయం వంటి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా.ఆకెళ్ల విభీషణశర్మ, ఉపసంపాదకులు డా.నరసింహాచార్య, రచయితలు పాల్గొన్నారు.

అమ్మవారికి టీటీడీ మహిళా ఉద్యోగుల సారె..!



తిరుచానూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా అమ్మవారికి పద్మావతి మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (టీటీడీ మహిళా ఉద్యోగులు) శుక్రవారం సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో గౌతమి, ఉన్నతాధికారుల సతీమణులతో పాటు టీటీడీ మహిళా ఉద్యోగులు హేమలత, అనురాధ, శ్రీవాణి, రుక్మిణి, చిన్నమ్మ, భవ్య, కవిత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

20 టన్నుల పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్



డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

తిరుమల తరహాలో తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో సైతం 20 టన్నుల పుష్పాలు, ఫలాలతో లక్ష కట్ ఫ్లవర్స్‌తో అలంకరణ చేశామని టీటీడీ ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆలయంలో ధ్వజస్థంభం, అంతర్భాగం, ఆస్థాన మండపం, పంచమీతీర్థ మండపం, ఫ్రైడే గార్డెన్లో అలంకరణ చేశామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పూలను తెప్పించామన్నారు. సంప్రదాయ పుష్పాలైన చామంతి, బంతి, గులాబీలకే ప్రాధాన్యమిచ్చామనిచెప్పారు. డిసెంబరు 7న అమ్మవారి ఆలయంలో జరిగే పుష్పయాగానికి ఐదు టన్నుల పూలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఉత్సవాల్లో మొదటి రోజు, నాలుగు, ఏడవ రోజు అలంకరణలు మారుస్తామని వివరించారు.

స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ తనిఖీ

రామచంద్రాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.రామాపురం వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని శుక్రవారం డీఈవో కేవీఎన్ కుమార్ తనిఖీ చేశారు. ఏఎంవో శివశంకరయ్య, ఏఎస్‌వో సారథి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రుద్రయాగం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరాలయంలో 11రోజులుగా చేపట్టిన రుద్రయాగం శుక్రవారంతో ముగిసింది. రుద్రయాగం, సమాప్తి, మహాపూర్ణాహుతి, మహాశాంతి అభిషేకం, కలశ ఉద్వాసన, కపిలేశ్వరస్వామి మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శివపార్వతులకు కల్యాణం నిర్వహించారు.

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మైదానంలో రెండు రోజులుగా జరిగిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలుర వ్యక్తిగత విభాగం చాంపియన్‌గా పి.సింధూర్(ఎస్వీసీసీ కాలేజీ), మెన్ అథ్లెటిక్ ఇన్‌స్టూషనల్ చాంపియన్‌గా ఎస్వీసీసీ కళాశాల జట్టు నిలిచింది. బాలికల వ్యక్తిగత విభాగం చాంపియన్‌గా ఎం.రక్షణ్య(సిద్ధార్థ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ), ఉమెన్ అథ్లెటిక్స్ ఇన్‌స్టూషనల్ చాంపియన్‌గా శ్రీపద్మావతి ఉమెన్ కాలేజీ జట్టు కైవసం చేసుకుంది. ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.భూపతి నాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి విజేతలకు ట్రోఫీ, మెడల్స్, బహుమతులను ప్రదానం చేశారు.

మిగిలిన నామినేటెడ్ పదవులు కేటాయించండి

- సీఎంను కలిసిన స్థానిక నేతలు



చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మిగిలి ఉన్న నామినేటెడ్ పదవులను పార్టీకోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఇవ్వాలని టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణలు సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. నారావారిపల్లె పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన సీఎంకు తిరుపతి విమానాశ్రయంలో స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. సీఎంను కలిసిన వారిలో తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మలు ఉన్నారు.

టీటీడీ సొంత డెయిరీ ప్రతిపాదనపై నివేదిక

తిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లక్ష దేశీ గోవులతో మహాధామం పేరుతో టీటీడీనే సొంత డెయిరీని నిర్మించుకోవచ్చనే సూచనతో ప్రత్యేకంగా తయారుచేసిన నివేదికను టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, యుగతులసి ఫౌండేషన్ చైర్మన్ శివకుమార్ శుక్రవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. నెయ్యి కల్తీ వివాదం నేపథ్యంలో టీటీడీనే ఓ గోశాల ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నెయ్యి తయారుచేసుకోవచ్చని పలువురి నుంచి అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈక్రమంలో ఇదే అంశంపై లక్ష దేశీ గోవులతో 'గో మహాధామం' పేరుతో డెయిరీ నిర్మాణం చేయవచ్చనే సమగ్ర నివేదికను తిరుమలలో అదనపు ఈవోకు అందజేశారు.

ప్రాచ్య కళాశాలలో సరస్వతీ పూజ, రుద్రాభిషేకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ప్రాచ్య కళాశాలలో శుక్రవారం సరస్వతీ పూజ, రుద్రాభిషేకం వేడుకగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుంకం సీతారామారావు మాట్లాడుతూ రాబోయే పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. శివలింగానికి హోమద్రవ్యాలతో అభిషేకం చేశారు. సరస్వతి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భాకరాపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుమ్మచేనుపల్లెలో ఎరుకల కులానికి చెందిన లక్ష్మీకాంతమ్మపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరినాథ్ అన్నారు. చిన్నగొట్టిగల్లు తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ఆ సంఘం తరపున నిరసన తెలియజేశారు. అనంతరం డీటీ వాసుదేవ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరమే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

చంద్రగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు మానసిక శారీరక, ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. మండలంలోని శ్రీనివాసమంగాపురం సమీపంలోని నారాయణ కళాశాలలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న జోనల్ క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరైన శాప్ చైర్మన్ రవినాయుడు, నారాయణ కళాశాల డీజీఎం కొండలరావులు జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ పతాకాన్ని, కళాశాల జెండాను ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. రవినాయుడు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులు విద్యతో పాటు క్రీడా పోటీలలో రాణించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికాంత్‌గుప్తా, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయండి

రామచంద్రాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు కోరారు. వెంకట్రామాపురంలోని ఆ ఫార్మసీ కళాశాలలో జేఎన్‌టీయూ, సెవెన్‌హిల్స్ కళాశాల సంయుక్తంగా రైజ్ ఆఫ్ డిజిటల్ ఫార్మసీ అనే అంశంపై ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ముగింపు సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు ఫార్మసీ విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు లక్ష్మయ్య, ప్రసన్నరాజు, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలపై విద్యార్థుల సర్వే

చంద్రగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఐతేపల్లె పంచాయతీలో శుక్రవారం తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ విద్యార్థులు ప్రజల జీవన ప్రమాణాలపై సర్వే చేశారు. ఐతేపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్వీయూ సమాజశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కుసుమ, ముకుంద నాయుడు, రమణయ్య, వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌లు విద్యార్థులు సమాజంలో ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. విద్యార్థులకు, అధ్యాపకులకు స్థానిక ఎంపీటీసీ ఏసీ శేఖర్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటుచేశారు. గ్రామస్తులు ఉస్మాన్, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్లతో స్నేహ పూర్వకంగా మెలగాలి

తిరుపతి(వైద్యం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన జూనియర్ విద్యార్థులతో సీనియర్లు స్నేహపూర్వకంగా మెలగాలని, అప్పుడే వారికి కళాశాలపై మక్కువ పెరిగి చదువులోనూ చక్కగా రాణించగలరని ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్ అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ ఆయుర్వేద కళాశాలలోని ధన్వంతరి ఆడిటోరియంలో శుక్రవారం కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, సీఐ వాసుదేవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

స్విమ్స్ పరిశోధనా విద్యార్థినికి డాక్టరేట్


సుప్రియ

తిరుపతి(వైద్యం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీ కార్డియాలజీ విభాగంలో పరిశోధనలు నిర్వహించిన విద్యార్థి డాక్టర్ ఎ.సుప్రియకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టాను ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ వనజాక్షమ్మ పర్యవేక్షణలో ఇంపాక్ట్ ఆఫ్ యోగ ఆన్ పీస్ ఫుల్‌నెస్ ఆఫ్ ప్రెగ్నెట్ ఉమెన్ కార్డియో వాస్క్యులర్ హెమోడైనమిక్స్, స్ట్రెస్ లెవల్స్ మెటర్నల్, ఫీటల్ అండ్ నియోనేటల్ అవుట్ కమ్స్ అనే అంశంపై సుప్రియ పరిశోధనలు చేసినందుకు గాను పీహెచ్ పట్టాను ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ దేశానికి శ్రీరామరక్ష'

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారత దేశానికి కాంగ్రెస్ పార్టీ శ్రీరామరక్ష అని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త ఐరాల లోకేష్ రెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కారకులైన కాంగ్రెస్ అధిష్ఠానం, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, దొడ్డా రెడ్డి రాంభూపాల్‌రెడ్డి, చిట్టిబాబు, వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

తిరుపతి(వైద్యం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో వైద్యం కోసం వచ్చి చేజార్చుకున్న బ్యాగును సెక్యూరిటీ సిబ్బంది బాధితులకు అందించారు. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మీనగర్‌కు చెందిన వనజ ఎంఆర్‌ఐ స్కానింగ్ కోసం శుక్రవారం స్విమ్స్‌కు వచ్చారు. స్కానింగ్ సమయంలో బ్యాగును ఆమె సహాయకురాలు మంజుల చేతికి ఇచ్చింది. స్కానింగ్ పూర్తయిన తర్వాత వారు ఆ బ్యాగును మరిచి వెళ్లిపోయారు. అక్కడ విధుల్లో ఉన్న పారిశుధ్య కార్మికురాలు కృష్ణవేణి ఆ బ్యాగును గుర్తించి సెక్యూరిటీ సిబ్బందికి అందించింది. వారు బ్యాగును తనిఖీ చేయగా రూ.1.50 లక్షల విలువ చేసే బంగారు, రూ.1,480 నగదు ఉన్నట్లు గుర్తించారు. అందులో ఉన్న కరెంటు బిల్లు ఆధారంగా బాధితుల చిరునామా కనుక్కొని సమాచారం ఇచ్చారు. సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ అధికారి ఇలంగోవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ బ్యాగును అందించారు.

IN THE COURT OF V ADDITIONAL DISTRICT JUDGE: TIRUPATI
I.A.NO. 291 OF 2022
O.S.NO. 95 OF 2013

Eriki Mahesh rep.by his Special power of Attorney, Dr. Yerabolu Narendra Reddy
...Petitioner/Defendant No.9
Vs.
Mabbu Siddharth and others
...Respondents

Substituted service of notice to the Respondent No. 4 to 6, 9 to 13

To
4. Mabbu Geethanjali, W/o Late Mabbu Subbarami Reddy,
5. Mabbu Venkatesh, S/o Late Mabbu Subbarami Reddy,
6. Mabbu Soni, D/o late Mabbu Subbarami Reddy,

R4 to R6 are residing at D.No.14-1-50, Nehru Street, Tirupati, Chittoor District

9. Eriki Murali S/o Late Eriki Balasubramanyam Reddy, residing at D.No.19-8-60, Hathiramji colony, Tirupati, Chittoor district
10. M.Dhananjaya Reddy, S/o M.Ramachandra Reddy
11. M.Deenadayal reddy, S/o M.Ramachandra Reddy
12. Smt. Padmavathi, D/o M.Ramachandra Reddy
13. Smt. Gowri, D/o M.Ramachandra Reddy

No.10 to 13 are residing at D.No.39, Nehru Street, Tirupati town and district (Proposed respondents)

Sir/Madam,

Please take notice that the above Petition by the petitioner/defendant no.9 and the same stands posted to 10.12.2024 for your notice at 10.30 a.m., before the above court, and if you fail to appear in person or through pleader the matter will be decided exparte.

/by order of court/
A.MADHAVI, Advocate
for Petitioner/Defendant No.9

IN THE COURT OF V ADDITIONAL DISTRICT JUDGE: TIRUPATI
I.A.NO. 290 OF 2022
O.S.NO. 95 OF 2013

Eriki Mahesh rep.by his Special power of Attorney, Dr. Yerabolu Narendra Reddy
...Petitioner/Defendant No.9
Vs.
Mabbu Siddharth and others
...Respondents

Substituted service of notice to the Respondent No. 4 to 6, 9 to 13

To
4. Mabbu Geethanjali, W/o Late Mabbu Subbarami Reddy,
5. Mabbu Venkatesh, S/o Late Mabbu Subbarami Reddy,
6. Mabbu Soni, D/o late Mabbu Subbarami Reddy,

R4 to R6 are residing at D.No.14-1-50, Nehru Street, Tirupati, Chittoor District

9. Eriki Murali S/o Late Eriki Balasubramanyam Reddy, residing at D.No.19-8-60, Hathiramji colony, Tirupati, Chittoor district
10. M.Dhananjaya Reddy, S/o M.Ramachandra Reddy
11. M.Deenadayal reddy, S/o M.Ramachandra Reddy
12. Smt. Padmavathi, D/o M.Ramachandra Reddy
13. Smt. Gowri, D/o M.Ramachandra Reddy

No.10 to 13 are residing at D.No.39, Nehru Street, Tirupati town and district (Proposed respondents)

Sir/Madam,

Please take notice that the above Petition by the petitioner/defendant no.9 and the same stands posted to 10.12.2024 for your notice at 10.30 a.m., before the above court, and if you fail to appear in person or through pleader the matter will be decided exparte.

/by order of court/
A.MADHAVI, Advocate
for Petitioner/Defendant No.9

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

12 బాటిళ్లు స్వాధీనం

తిరుపతి(వైద్యం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల నుంచి మద్యం తీసుకొచ్చి అధిక ధరకు విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్లు తిరుపతి రూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడు తెలిపారు. ఆమె నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ రేణిగుంట మండలం ఎస్‌యాపురానికి చెందిన కౌశల్య మద్యం అధిక ధరకు విక్రయిస్తుందనే సమాచారంతో దాడులు చేశామని తెలిపారు. ఆమెను అదుపులోకి తీసుకుని, 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఐ కవీశ్వరనాయుడు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ అందరికీ అవసరం

ఓటీపీ చెప్పి మ్యాపింగ్‌కు సహకరించండి ● అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి



తిరుపతి-ఆంధ్రజ్యోతి: గత వైసీపీ ప్రభుత్వం ప్రజల నాడి తెలుసుకునే క్రమంలో రకరకాల సర్వేల పేరుతో ఇబ్బందులు పెట్టింది. ఇంటింటికీ వలంటీర్లను పంపింది. వీరితోపాటు వైసీపీ కార్యకర్తలు వెళ్లి కుటుంబాల వ్యక్తిగత సమాచారం సేకరించారు. ఇది దుర్వినియోగమైనట్టు గతంలో బలమైన ఆరోపణలొచ్చాయి. దీంతో ఇంటికి ఎవరొచ్చి సమాచారం అడుగుతున్నా జనం అనుమానించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇంటింటికీ జియో మ్యాపింగ్, ఆధార్ సీడింగ్ సమాచారం కోసం వెళ్తున్న మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు కొందరు సహకరించడంలేదు. మా ఇళ్లకు జియోట్యాగింగ్ అవసరం లేదని ఆదాయపన్ను చెల్లించేవారు, అపార్ట్‌మెంటువాసులు కొందరు తిరస్కరిస్తున్నారు. అలాంటి అపోహలొద్దని, ఇది పూర్తిగా ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే అని, అందరూ సహకరించాలని మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. 'జియో ట్యాగింగ్ అనేది ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు మాత్రమే కాదు. ప్రతి ఇల్లూ ట్యాగ్ అయితే ఎలాంటి సందర్భాలలోనైనా ప్రభుత్వం వేగంగా స్పందించేందుకు వీలుంటుంది. మ్యాపింగ్ వలన ఒక ప్రాంతంలో ఎంతమంది నివసిస్తున్నారు. వారికి మౌలిక అవసరాలు తీర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంచనా ప్రభుత్వం వద్ద ఉంటుంది. ఏదైనా విపత్తులు జరిగినప్పుడు ఆయా ప్రాంతంలో ఉన్న వారికి సహాయక చర్యలతో పాటు అందరికీ లబ్ధిచేకూరేందుకు ఉపయోగపడుతుంది. శుక్రవారం నుంచి మైగ్రేట్ వాళ్లను కూడా మ్యాపింగ్ చేశారు. అదేవిధంగా ఒక ఇంటిలో ఒకరే ఉండి చని [illegible] అలాంటి ఇంటికి కూడా ప్రత్యేక ఆప్షన్ ఇచ్చారు. అందువల్ల శుక్రవారంతో 90 శాతం వరకు ట్యాగింగ్ పూర్తయిపోయింది. మిగిలింది శనివారం పూర్తి చేయనున్నాం. సచివాలయ సిబ్బంది ఇళ్లను సందర్శించి వివరాలు సేకరిస్తారు. ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తారు. కుటుంబ సభ్యుల్లో ఒకరి నుంచి వేలిముద్రలు సేకరిస్తారు. ఇంటిని ట్యాగ్ చేయాలంటే కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు డోర్ ముందు నిలబడి ఫొటో దిగాలి. ఈ క్రమంలో సచివాలయ సిబ్బందికి ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది. సచివాలయ సిబ్బందికి ఓటీపీ చెప్పి సహకరించండి' అని విజ్ఞప్తి చేశారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన అప్సా అధ్యక్షుడు




తిరుపతి(విద్య), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమ్మవారి దర్శనార్థం శుక్రవారం తిరుచానూరుకు వచ్చిన డిప్యూటీ స్పీకర్‌ను కలిసి దుశ్శాలువతో సన్మానించారు. ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి


రుయాస్పత్రి పరిపాలనా భవనం ఎదుట కార్మికుల ఆందోళన

తిరుపతి(వైద్యం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో ఏజెన్సీ తరఫున పనిచేసే పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోగా మూడేళ్లుగా ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించకుండా శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టు నిర్వాహకుడిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నేతలతో కలిసి ఆయన రుయాస్పత్రి ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. రుయాస్పత్రి, ప్రసూతి ఆస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాల పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. అనంతరం ఏజెన్సీ నిర్వాహకులకు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గడువు లోపు సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వేణుగోపాల్, నేతలు సుబ్రహ్మణ్యం, జయచంద్ర, బుజ్జి, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి సౌందర్యమే ఎస్జీడీ కవిత్వం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజేశ్వరమ్మ, శ్రీనివాసులురెడ్డి, రవికుమార్, వెంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సౌందర్యాన్ని ఎస్జీడీ చంద్రశేఖర్ కవిత్వంగా మలిచారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్జీడీ చంద్రశేఖర్ రాసిన సూక్ష్మ కవితలు-2 పుస్తకాన్ని ఎస్వీయూ తెలుగు విభాగంలోని జీఎన్ రెడ్డి సెమినార్ హాల్లో శుక్రవారం ఆవిష్కరించారు. తెలుగు విభాగం - ఈ తరం కవితా వేదిక సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. సభాధ్యక్షత వహించిన తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ మాట్లాడుతూ తెలుగు విభాగంలో పీజీ, పీహెచ్‌డీ చేసి అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా ఎస్జీడీ చంద్రశేఖర్ నాలుగు దశాబ్దాలుగా అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. పరిశోధనలోనూ, సాహిత్య సృజనలోనూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని చెప్పారు. పుస్తకావిష్కరణ చేసిన ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఎస్జీడీ చంద్రశేఖర్ మనుషుల పట్ల చూపే సున్నితమైన భావన, సాహిత్య రచనలోనూ కనిపిస్తుందని చెప్పారు. ఈతరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిలక్, శ్రీశ్రీ కవిత్వ ప్రభావం ఎస్జీడీపై ఎక్కువగా ఉందన్నారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. సభ ఆరంభంలో పీజీ ద్వితీయ సంవత్సర విద్యార్థినులు లావణ్య, ఆదిలక్ష్మి పాడిన ఉద్దీపన గీతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో విశ్రాంతాచార్యులు కాటూరి శారద, కె.మునిరత్నం, ఎన్.మునిరత్నమ్మ, ఎలవర్తి చంద్రమౌళి, సాహిత్యవేత్తలు ఆముదాల మురళి, ఆర్వీ కృష్ణస్వామిరాజు, ఎస్‌హెచ్ సౌభాగ్యమ్మ, ఆకుల మల్లేశ్వరరావు, సింగార బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

రూరల్‌లో 848 మందికి ఆధార్ సేవలు

తిరుపతి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల పరిధిలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఈనెల 26వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఆధార్ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఐదుగురు డిజిటల్ అసిస్టెంట్ల నేతృత్వంలో 848మందికి ఆధార్‌సేవలు అందించామని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు.


నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి తన కుమారుడి వివాహానికి సీఎం చంద్రబాబు నాయుడిని ఆహ్వానిస్తున్న శ్రీశైలం ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్, టీడీపీ నేత రెడ్డివారి చక్రపాణిరెడ్డి

పింఛన్ల పంపిణీకి చర్యలు

తిరుపతి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారం పంపిణీ చేసేందుకు గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శుక్రవారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకున్నారని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు.

శ్రీ గాలిగోపురం మఠం అనే వైకుంఠకోయిల్, తిరుపతి.
దేవాదాయ శాఖ, తిరుపతి జిల్లా.

బహిరంగవేలం ప్రకటన

ఆర్.సి.నెం. 28/2017, పరిపాలన తేది 15-11-2024

తిరుపతి జిల్లా, తిరుపతి, చిన్నబజారు వీధిలో యుండు డోర్ నెం. 8-2-225 శ్రీ గాలిగోపురం మఠమునకు చెందిన ఇల్లు 1, ఖాళీస్థలము 3, అంగడి 2, 06-12-2024వ తేది శుక్రవారము మధ్యాహ్నం 12.00 గం.లకు దేవాదాయశాఖ అధికారుల సమక్షములో బహిరంగ వేలం ద్వారా అద్దెకి ఇవ్వబడును.

షెడ్యూలు దాఖలా


డోర్ నెం.	వివరములు పొడుగు వెడల్పు	లీజు కాలం
1) 8-2-225-1, చిన్నబజారు వీధి, తిరుపతి.	అంగడి 29X11 = 319 చ.అ.	01-01-2024 నుండి 30-12-2027 (3సం॥లు)
2) 8-2-225.-2, చిన్నబజారు వీధి, తిరుపతి.	అంగడి 29X14 = 406 చ.అ.	10-02-2025 నుండి 09-02-2028 (3సం॥లు)
3) 7-1-7, రాములవారి ఉత్తరమాడ వీధి, తిరుపతి	ఇల్లు 21.8 X 18.10 394.5 చ.అ.	06-12-2024 నుండి 05-12-2027 (3సం॥లు)
4) 7-1-6, రాములవారి ఉత్తరమాడ వీధి, తిరుపతి. (ఎ.1)	ఖాళీస్థలం 65X27 : 1755 చ.అ.	06-12-2024 నుండి 05-12-2027 (3సం॥లు)
5) 7-1-7, శ్రీరాములవారి ఉత్తరమాడ వీధి, తిరుపతి. (ఎ.2)	ఖాళీస్థలం 21.6X32 : 697.8 చ.అ.	06-12-2024 నుండి 05-12-2027 (3సం॥లు)
6) 7-1-7, శ్రీరాములవారి ఉత్తరమాడ వీధి, తిరుపతి. (ఎ.1)	ఖాళీస్థలం 25.6X103 : 2,636.8 చ.అ.	06-12-2024 నుండి 05-12-2027 (3సం॥లు)

మరింత సమాచారం కోసం మఠం కార్యాలయంలో సంప్రదించగలరు.
ఇట్లు : మఠం ఫిట్ పర్సన్



వాన జల్లుల్లో
చల్లని తల్లి వేడుకలు

బ్రహ్మోత్సవాల్లో నేడు
- ఉదయం 8 గంటలకు ముత్యపు పందిరి
- మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
- సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్‌సేవ
- రాత్రి 7 గంటలకు సింహవాహనం



పెద్ద శేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు వాన జల్లుల నడుమ వేడుకలు ఘనంగా కొనసాగాయి. సుప్రభాతసేవ అనంతరం సహస్రఅర్చన, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం వాహన మండపంలో పట్టు పీతాంబరాల వజ్రవైడూర్యాలు స్వర్ణాభరణాలతో అమ్మవారిని అలంకరించి పెద్దశేషుడిపై అధిష్ఠింపజేశారు. ఉదయం పరమపద వైకుంఠనాథుని రూపంలో పెద్దశేష వాహనంపై తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. వర్షం కారణంగా కొంతసేపు ఘటటోపం నీడన అమ్మవారి వాహనసేవ సాగింది. సాయంత్రం 6 గంటలకు వీణచేతపట్టిన సరస్వతిదేవిగా శ్వేతవర్ణ పట్టువస్త్రం, వజ్రవైడూర్య స్వర్ణాభరణాలతో ఊంజల్‌సేవలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. అనంతరం అస్థాన మండపం నుంచి వేంచేవుగా వాహన మండపానికి తీసుకొచ్చి అమ్మవారి ఉత్సవమూర్తిని హంసవాహనంపై కొలువుదీర్చారు. రాత్రి గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా భక్తుల కోలాటాలు, భజన బృందాలు, మంగళవాయిద్యాలు, జీయర్ స్వాముల ప్రబంధపారాయణం నడుమ అమ్మవారు హంసవాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. భక్తులతో ఆలయ మాడవీధులు కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమాల్లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్‌బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి











శ్రీవారికి వైఖానసం.. అమ్మవారికి పాంచరాత్రం
ఎందుకిలా?

తిరుమలేశుడికి వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్య కైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తే, ఆయన దేవేరి పద్మావతి అమ్మవారికి పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా వీటిని నిర్వహిస్తారు. ఎందుకు ఇలా.. అనే సందేహానికి అమ్మవారి ఆలయ అర్చకులు, కంకణభట్టార్ కాండూరు శ్రీనివాసాచార్యులు ఇలా వివరించారు...

"నిత్య కైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు ఎలా నిర్వహించాలి.. అనే అంశాన్ని వైకుంఠంలో శ్రీమహావిష్ణువు అయిదు రాత్రుల పాటు అమ్మవారికి వివరించారట. తొలుత అమ్మవారికి ఆ తర్వాత వరుసగా ఆదిశేషుడు, గరుత్మంతుడు, బ్రహ్మ, పరమేశ్వరులకు ఐదురాత్రుల ఆగమశాస్త్రాన్ని ఉపదేశించారు. సాక్షాత్తు స్వామివారే ఐదు రాత్రులు ఉపదేశించడం వల్ల ఈ శాస్త్రానికి పాంచరాత్ర ఆగమశాస్త్రం అనే పేరువచ్చింది. ఆ తర్వాత దీనిని 40వేల మంది ఋషులు- మహాఋషులు, దాన ఋషులు, బ్రహ్మఋషులు, రాజ ఋషులు 1006 సంహితరూపంగా రచించి అందించారు. అందులో 108 సంహితాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటి ఆధారంగానే ఆయా ఆలయాల్లో ఒక్కొక్క సంహితను అనుసరించి పూజలు నిర్వహిస్తున్నారు. ఇది మనసుల్లో అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. తిరుచానూరు అమ్మవారి ఆలయంతోపాటూ భద్రాచలం, శ్రీకూర్మం, సింహాచలం, శ్రీరంగం, కంచి, కుంభకోణం, కురుక్షేత్రం, ఒంటిమిట్ట తదితర ఆలయాల్లో పాంచరాత్ర ఆగమశాస్త్రంను అనుసరించే పూజలు జరుగుతున్నాయి. వైఖాననసం విషయానికి వస్తే.. తిరుమల శ్రీవారి ఆలయంతోపాటూ, నాగలాపురం, నారాయణవనం, అప్పలాయగుంట, శ్రీనివాస మంగాపురం, కార్వేటినగరం, గోవిందరాజస్వామి ఆలయం, కీలపట్ల తదితర ఆలయాల్లో స్వామివార్లకు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్యకైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు."



కాండూరు శ్రీనివాసాచార్యులు

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ఫల పుష్పాలే మాలలుగా..
తిరుమంజన సేవ

అమ్మవారి స్పర్శ క్షణకాలమే అయినా పవిత్రమైనది.. అపురూపమైనది. స్నపనతిరుమంజన కార్యక్రమంలో ఉత్సవమూర్తికి చేసే అలంకరణలు స్వల్పకాలానికే పరిమితమైనా విభిన్నంగా కొనసాగుతాయి. పూలు, ఫలాలు, ఎండు ఫలాలతో మాలలు కట్టి అలంకరిస్తారు. ఏదీ కొన్ని నిముషాలకు మించి అమ్మవారి మెడలో ఉండదు. అయినా ప్రత్యేకంగా ఫల, పుష్పాలతో అలంకరించిన శ్రీకృష్ణ ముఖ మండపంలో ఈ స్నపన తిరుమంజనసేవ జరుగుతుంది. శుక్రవారం మధ్యాహ్నం కంకణభట్టర్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన సేవలో ఏడు రకాల మాలలను అమ్మవారికి అలంకరించారు. ఇందులో నెమలి ఈకలు, తామర పూల గింజలు, పైనాపిల్, రోజ్ పెటల్స్, నందివర్ధనం మొగ్గలు, తులసిమాలలు, కిరీటాలు, గొడుగులు ఉన్నాయి. ఈ మాలలను ఓ భక్తుడు అమ్మవారికి కానుకగా అందించారు. మండపాన్ని వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్‌తో పాటు ఆపిల్, జామ, మొక్కజొన్న, ఆర్కిడ్స్, పైనాపిల్ వంటి ఫలాలతో అలంకరించారు.



ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



ఫలపుష్పాలతో ఆకట్టుకుంటున్న కేటీ మండపం



నెమలి ఈకలు, తామర గింజలు, నెల్లికాయ మాలలు

ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 21న కన్నప్ప ధ్వజారోహణం, 22న స్వామివారి ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, రాత్రి నందిసేవ, 27న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28న స్వామిఅమ్మవార్ల కల్యాణం, 1న సభాపతి కల్యాణం, 2న కైలాసగిరి ప్రదక్షిణ, 3న ధ్వజావరోహణం, 4న పల్లకీసేవ, 5న ఏకాంతసేవ, 6న శాంతి అభిషేకం జరుగుతుందన్నారు.

నేడు అష్టోత్తర శత కలశాభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, బిల్వ నిమజ్జనం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. అలాగే సాయంత్రం 7గంటలకు స్వర్ణముఖిలో నదీ హారతులు జరుగుతాయని తెలిపారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను కూడా పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శనం భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. కాగా, బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి రూ.3.84 కోట్లు ఆదాయం లభించినట్లు శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 56,952 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 21,714 మంది తలనీలాలు సమర్పించారు.

త్వరలో జైలుకు ముగ్గురు వైపీసీ నేతలు

సమస్యల పరిష్కారానికి మండలాల వారీగా ప్రత్యేక సిబ్బంది ● ఎమ్మెల్యే సుధీర్ వెల్లడి

శ్రీకాళహస్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అక్రమార్కులను త్వరలోనే జైలుకు పంపుతామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ల జాబితాను విడుదల చేసిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్లపాటు సాగించిన దుర్మార్గాలను వెలికి తీస్తున్నట్లు చెప్పారు. మరో మూడు రోజుల్లోనే ముగ్గురు వైసీపీ నాయకులు జైలుకు వెళ్లబోతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణానికి మనోజ్ కుమార్‌ను 94917 06316 నెంబరులో సంప్రదించాలని సూచించారు. అలాగే శ్రీకాళహస్తి మండలానికి మణెమ్మ (70321 78191), తొట్టంబేడుకు భారతి (91820 31426), ఏర్పేడుకు హేమ (94418 55838), రేణిగుంటకు సుజాత (83670 90320)ను నియమించామన్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్నా.. చనిపోతున్నా..!

తిరుమల నుంచి సెల్ఫీ వీడియో పంపిన యువతి ● పోలీసులను ఆశ్రయించిన సోదరుడు ● గంట వ్యవధిలోనే యువతిని గుర్తించిన టూటౌన్ పోలీసులు

తిరుమల, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తన భర్తతో జరిగిన గొడవ కారణంగా తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానంటూ ఓ యువతి తిరుమల నుంచి తన అన్నకు వీడియో పంపింది. దీనిపై అతడు నిమిషాల వ్యవధిలో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. గంట వ్యవధిలోనే ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తమిళనాడులోని హోసూర్‌కు చెందిన శంకర్, భావన దంపతులకు ఇద్దరు పిల్లలు. భర్తతో జరిగిన గొడవ కారణంగా గురువారం రాత్రి ఆమె ఇంటి నుంచి తిరుమలకు బయలుదేరింది. శుక్రవారం ఉదయం ఆమె శ్రీవారిమెట్టు మార్గం నుంచి 'నా భర్తతో గొడవ జరిగింది. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నా' అంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేసి వాట్సాప్ ద్వారా బెంగుళూరులోని తన అన్న ప్రసాద్‌కు పంపింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఫోను చేసినా ఈమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఉదయం పదిన్నర గంటల సమయంలో కంట్రోల్ రూమ్ నుంచి తిరుమల పోలీసులను ప్రసాద్ ఆశ్రయించి, తన చెల్లిని కాపాడాలని కోరారు. వెంటనే టూటౌన్ సీఐ శ్రీరాముడు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆ సెల్ఫీ వీడియో సాయంతో భావన కదలికలపై సీసీ కెమెరాల ఫుటేజ్, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిఘా పెట్టి.. గాలించారు. 11.30 గంటల సమయంలో తిరుమలలోని ఎస్వీ గెస్ట్ హౌస్ వద్ద భావనను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారికి ఆమెను అప్పగించి.. ఆ యువతికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.



యువతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

మంగళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జిల్లాలో 2,64,636 మంది లబ్ధిదారులకు గానూ రూ.112.25 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు ఇంటికి వస్తారని, అందుబాటులో ఉండి పెన్షన్ తీసుకోవాలని సూచించారు. రెండు నెలలు తీసుకోకపోయినా మూడో నెలలో ఒకేసారి మొత్తం చెల్లిస్తారని తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని సూచించారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో.. ఏడుగురికి ఆరేళ్ల జైలుశిక్ష

రూ.6 లక్షల చొప్పున జరిమానా

మంగళం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ ఏడుగురికి ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఆరేళ్ల జైలుశిక్ష, ఆరు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. 2017లో కరకంబాడి బీట్ టీఎన్‌పాలెం సెక్షన్‌లో పట్టుబడిన కేసులో ఏడుగురు ముద్దాయిలకు శిక్ష పడినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాకు చెందిన అద్దంకి గంగాధరం, తుపాకుల గంగాధరం, తుపాకుల శ్రీనివాసులు, గుండ్రాళ్ల మునయ్య, పాముల నాగయ్య, టీ.బంగారయ్య, తమిళనాడుకు చెందిన కె.మురగయ్యలు ఇందులో ఉన్నారన్నారు. శేషాచల అడవుల్లోని ఎర్రచందనాన్ని నరికి అక్రమంగా తరలించే నేరస్తులకు శిక్ష తప్పదని హెచ్చరించారు.

'డ్రగ్స్ ఆరోపణలు అవాస్తవం'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో డ్రగ్స్ వినియోగిస్తున్నారని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని రిజిస్ట్రార్ ఆర్.జె.రమాశ్రీ పేర్కొన్నారు. అనుమానం కల్గిన ఇద్దరు విద్యార్థులకు రుయాలో వైద్య పరీక్షలు చేయించామన్నారు. వారు డ్రగ్స్ వాడలేదని రుయా నివేదిక ద్వారా స్పష్టమైందన్నారు. ఆరోపణలు వచ్చిన విద్యార్థులను తల్లిదండ్రుల చెంతకు పంపి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నామన్నారు. విద్యార్థుల పట్ల మరింత పర్యవేక్షణ ఉంచి, క్రమశిక్షణతో సన్మార్గంలో నడిపించాలని నిర్ణయించామన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే జనవాణి



జనవాణి కార్యక్రమంలో జనసేన నేతలు

గూడూరు అర్బన్, నవంబరు (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలను సమస్యలను పరిష్కరించేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టినట్లు ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ తదితర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించేలా జనసేన చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సాయికిరణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెల్త్ అసిస్టెంట్ మృతి



ప్రభాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఓజిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలికి చెందిన వైద్య ఉద్యోగి (హెల్త్ అసిస్టెంట్) బల్లి ప్రభాకర్ (51) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. నాయుడుపేట మండలం గొట్టిప్రోలు పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆయనకు శుక్రవారం ఉదయం గుండె పోటు వచ్చింది. వెంటనే నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రభాకర్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామం ఓజిలికి తీసుకు వచ్చారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఓజిలి, గొట్టిప్రోలు వైద్యులు డానియేల్ రాజ్, వికాస్, శంకరయ్యతో పాటు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, నాయుడుపేట తాలూకా అధ్యక్షుడు కన్నా వెంకటగోపాల్, టీడీపీ నాయకులు కనుమూరు గోపాల్‌రెడ్డి, ఎద్దల ధనుంజయరెడ్డి తదితరులు ప్రభాకర్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

తడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని వాటంబేడు గ్రామానికి చెందిన పాలవాక్కం రవి(58) కొంత కాలంగా ఎడమచేయ్యి నొప్పితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ సైతం చేయించుకున్నాడు. అప్పటి నుంచి బరువైన వస్తువులను చేతులతో ఎత్తకూడదని డాక్టర్లు సలహా ఇచ్చారు. బుధవారం తన పొలంలో పనిచేసేందుకు కూలీలు రాకపోయే సరికి యూరియా బస్తాని తానే మోసుకెళ్లాడు. దీంతో ఎడమ చేయ్యి నొప్పి తీవ్రమైంది. భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో బయటకెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి అపస్మారకస్థితిలో ఉండటంతో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాల సీజ్



ఎరువులను తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

కోట, వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలను సీజ్ చేస్తామని వెంకటగిరి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగార్జున సాగర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కోట పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను స్థానిక ఏవో నిరంజన్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో ఎరువులను పరిశీలించారు. కొన్ని ఎరువుల నాణ్యత పరిశీలనకు నమూనాలను సేకరించారు. రెండు దుకాణాల్లో ఓ ఫారంలు, లైసెన్స్ నమోదు కాకపోవడంతో ఎరువుల అమ్మకాలను వెంటనే నిలిపి వేయాలని ఆదేశించారు.ఓ ఫారంలు ఖచ్చితంగా డీలర్ల వద్ద ఉండాలన్నారు. ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించడంతో పాటు బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే నిల్వలు, ధరలను స్టాక్‌బోర్డులో చూపాలన్నారు. నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ● వాకాడుని ఎరువుల దుకాణాల్లో వెంకటగిరి సహాయ వ్యవసాయ సంచాలకుడు నాగార్జునసాగర్, మండల వ్యవసాయశాఖ అధికారిణి దీప తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులను కొన్న రైతులకు డీలర్లు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. స్టాక్, బిల్ పుస్తకాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. స్టాక్‌కు సంబంధించినటువంటి జీరో ఫారాలు తప్పనిసరిగా లైసెన్స్‌లో పొందుపరుచుకోవాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

జీఎస్టీ చెల్లింపులపై అవగాహన కలిగివుండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అరుణకుమారి

గూడూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ చెల్లింపులపై వ్యాపారస్థులందరూ అవగాహన కలిగివుండాలని వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ అరుణకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో వ్యాపారస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారస్థులందరూ తమ సంస్థలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. జీఎస్టీ కలిగిన వారు తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రమీల, సోమిశెట్టి చెంచురామయ్య, చంద్రశేఖర్, కోట సునీల్‌కుమార్, సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌కు ఆరేళ్ల చిన్నారి

నాయుడుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన తండ్రి.. బిడ్డను విడిచివెళ్లిపోయిన తల్లి.. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆరేళ్ల చిన్నారిని నాయుడుపేట అర్బన్ సీఐ బాబి ఐసీడీఎస్ అధికారిరులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు... నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో ఆరేళ్ల చిన్నారి దిక్కుతోచని స్థితిలో ఉండడాన్ని స్థానికులు గమనించి సీఐకి సమాచారం అందించారు. సీఐ బాబి సంఘటనాస్థలికి చేరుకున్న మద్యం మత్తులో ఉన్న తండ్రి పక్కన కూర్చొని దిక్కులు చూస్తున్న చిన్నారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. అనంతరం ఆ చిన్నారిని గూడూరులోని బాలసదన్‌కు తరలించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తీరం.. అల్లకల్లోలం

వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. రెండు రోజులుగా కెరటాలు తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం ఎడతెరపిలేకుండా కురుస్తుండటం, చల్లటి గాలులతో కూడిన ముసురు కమ్ముకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధి కారుల సూచనలతో తహసీల్దారు రామయ్య, మండలస్థాయి అధికారులకు తుఫాన్ పట్ల దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ సిబ్బంది తీరప్రాంత గ్రామాల ప్రజలను, రైతులను అప్రమత్తం చేస్తున్నారన్నారు. ఎక్కడ ఏ చిన్నసంఘటన జరిగినా తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, వాగులు, వంకలు, చెరువు, నదిపరి వాహక ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండలంలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నామని తహసీల్దారు చెప్పారు.

సముద్రంలో అలల అలజడి

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారి తీరం దాటనున్న నేపథ్యంలో సముద్రంలో పొద్దు పోయిన తరువాత అలల ఉధృతి పెరిగింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కోట మండలం గోవింద పల్లి పాళెం, శ్రీనివాసపురం గ్రామాల్లో తహసీల్దారు జయ జయరావు సందర్శించి మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. వీఆర్వోలను పంచాయతీ కేంద్రాల్లో అందు బాటులో ఉండి అవసరమైతే నిత్యవసర సరుకులను పంపిణీకి సిద్ధం చేయాలని తహసీల్దారు కోరారు. మత్స్యకారులు సముద్రం లోకి వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉంటే సాయంత్రం వరకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఉన్న సముద్రంలో ఒక్కసారిగా అలల ఉధృతి పెరిగి ఉరకలేసింది. చిన్నపాటి శబ్దాలు చేస్తూ అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ ఉన్నాయి. దీంతో సముద్ర తీర మత్స్యకార గ్రామాలు భయంగుప్పెట్లో ఉన్నాయి.

పులికాట్‌లో చేపల వేటకు వెళ్లొద్దు

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రాంతంలో ఇప్పటి వరకు తుపాన్ ప్రభావం అంతగా లేదు. ఈదురు గాలులు వీయడంతో పాటు భారీ వర్ష సూచనతో పులికాట్ సరస్సులో మత్స్యకారులు వేటకు వెళ్లదని అధికారులు హెచ్చరించారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి నేతృత్వంలో డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకొని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షం కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిరు జల్లులు.. చలి గాలులు



సూళ్లూరుపేటలో బాలికల పాఠశాల వద్ద రోడ్డుపై గుంతల్లో వర్షపునీరు

సూళ్లూరుపేట, నాయుడుపేట, ఓజిలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో సూళ్లూరుపేటలో శుక్రవారం ఉదయం నుంచే చలి గాలులతో కూడిన చిరు జల్లులు కురిశాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయంగా మారాయి. మరమ్మతులు చేసేందుకు జీఎస్‌టీ రోడ్డును తవ్వేయడంతో వర్షపు నీరు నిలబడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం కాస్త తెరిపిచ్చినా మళ్లీ సాయంత్రం 6 గంటల నుంచి జల్లులతో కూడిన వర్షం కురిసింది. ● నాయుడుపేటలో చలిగాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. రెవెన్యూ అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న వారితో మాట్లాడారు. వర్షం ఎక్కువైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ● ఓజిలి మండలంలో శుక్రవారం చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. రోజంతా దట్టమైన మబ్బులతో చలి వాతావరణం నెలకొంది.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ భానుప్రియ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటిల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అజెండాలో పలు అంశాలకు సంబంధించి ముందుస్తు అనుమతులు ఇవ్వడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమను సంప్రదించ కుండా అజెండానుఎలా ప్రవేశ పెడతారని నిలదీశారు. అంతే కాకుండా ప్రతి నెలా నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశాలను మూడు నెలల కోసారి మొక్కుబడిగా నిర్వహిస్తే ఎలా అని నిలదీశారు. వైస్ చైర్మన్ బాలయ్య మాట్లాడుతూ ప్రతి నెలా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని సొంత పార్టీ కౌన్సిలర్లు చెప్పినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇంతకీ చైర్‌పర్సన్ ఏ పార్టీ వారో చెప్పాలంటూ కౌన్సిలర్లు పట్టుబట్టారు. 17వ వార్డు కౌన్సిలర్ పూజారి లక్ష్మి, 9వ వార్డు కౌన్సిలర్ కల్యాణి జోక్యం చేసుకొంటూ చైర్‌పర్సన్‌ను కించపరిచే విదంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పడంతో కౌన్సిలర్ల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఇంతలో ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. అసందర్భ విషయాలపై వాగ్వాదాలు మాని మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి



లక్ష్మీ సహస్ర నామార్చన చేస్తున్న మహిళలు

వడమాలపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం మహిళలు తులసి, నెల్లిచెట్టుకు పూజలు చేశారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో తులసి, నెల్లిచెట్ల ముందు లక్ష్మీ దేవి చిత్రపటాన్ని, మహాశివుడి ప్రతిరూపాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నెయ్యి దీపాలు వెలిగించి లక్ష్మీ సహస్ర నామార్చన చేశారు. సాయంత్రం నగరేశ్వరుడికి అభిషేకం చేసి పూలమాలలతో అలంకరించారు. రుద్ర గమకాలు పటిస్తూ మహా రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం వనభోజనాలు జరిగాయి.

టీడీపీ సభ్యత్వ నమోదులో వేగం పెంచుదాం



రామసముద్రంలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

వడమాలపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు భరోసానిచ్చే టీడీపీ సభ్యత్వ నమోదులో కలిసికట్టుగా వేగం పెంచాల్సి ఉందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికారి ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. శుక్రవారం మండలంలోని రామసముద్రంలో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు సహకారంతో మండలంలో మూడు వేలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయని చెప్పారు. ఇదే స్ఫూర్తితో నాయకులందరూ కలిసికట్టుగా మండలంలో ఐదు వేల సభ్యత్వాలు పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు జానా వెంకటయ్య, పెద్దబ్బ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

బియ్యం దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

● ఇద్దరు వ్యాపారులకు రూ.40 వేల జరిమానా



బియ్యం మూట కొలతల్లో తేడా చూపుతున్న విజిలెన్స్ సీఐ, లీగల్ మెట్రాలజీ అధికారి

పుత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బియ్యం దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నగరి రోడ్డు, ఈశ్వర గుడి వీధి తదితర ప్రాంతాల్లో దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. బియ్యం మూటపై 26 కిలోలు ముద్రించగా కొలతల్లో మాత్రం 25 కిలోలు ఉండడాన్ని గుర్తించారు. నందిని ట్రేడర్స్ యజమాని పురుషోత్తం, చిత్ర అండ్ కో యజమాని సీఎస్ రఘుకు ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున రూ.40 వేలు జరిమానా విధించినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి, లీగల్ మెట్రాలజీ అధికారి మల్లేశ్వర్ తెలిపారు. తప్పుడు తూనిక కొలతలతో ప్రజలను మోసగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గృహ సిలిండర్ల వినియోగంపై...

అలాగే గృహ అవసరాలకు సరఫరా అవుతున్న సిలిండర్లు హోటళ్లలో వనియోగిస్తుండ డంపై కూడా దాడుల నిర్వహించారు. అప్రమత్తమైన కొందరు దుకాణాలు మూసివేశారు. నగరి రోడ్డులోని రాంబాబు బిర్యానీ హోటల్, కె.ఎన్.రోడ్డులోని వెంకటేశ్వర హాట్ చిప్స్, రాగ ఫాస్ట్ ఫుడ్స్ తోపు ప్రాంతంలో కృష్ణ టీ స్టాల్, భాస్కర్ టీస్టాల్‌లో ఆరు గృహ వినియోగ సిల్లిండర్లను స్వాధీనం చేసుకున్నారు. యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఆర్ఐ తిరుమలసాయి, వీఆర్ఏ యశోద చెప్పారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

పుత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఐ సురేంద్రనాయుడు పేర్కొన్నారు. పట్టణంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అంబేడ్కర్ భవన్ వేదికగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహన రికార్డులు, రోడ్డు భద్రత, ప్రమాదాలు, సామాజిక బాధ్యత వంటి అంశాలను విశదీకరించారు. ఈ సందర్భంగా సురేంద్రనాయుడు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ఇటీవల కార్వేటినగరం రోడ్డులో జరిగిన ప్రమాదాన్ని గుర్తుచేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో ఆ ఏడు స్టేషన్లు!

(పుత్తూరు, ఆంధ్రజ్యోతి)



చెన్నై కేంద్రంగా వున్న దక్షిణ రైల్వే జోన్‌లో ఉన్న ఏపీలోని ఏడు రైల్వే స్టేషన్లు అభివృద్ధికి ఆమడదూరంలోనే వుండిపోయాయి. ఆధునికీకరణ, లైన్ల విస్తరణ, అర్బన్ రైళ్ల నిర్వహణ, కొత్త రైళ్ల నిలుపుదల తదితర విషయాల్లో అధికారుల వివక్ష కారణంగా ఈ స్టేషన్లు వెనకబడిపోయాయి. గుంతకల్ కేంద్రంగా ఉన్న దక్షిణమధ్య రైల్వే డివిజన్‌లో కలిపితే తప్ప ఈ స్టేషన్లు అభివృద్ధికి నోచుకునే పరిస్థితి లేదు.

రోజూ రూ.రెండు లక్షల ఆదాయం

పూడి, తడుకు, ఎస్‌వి పురం, పుత్తూరు, వేపగుంట, ఏకాంబరకుప్పం, నగరి స్టేషన్లు దక్షిణ రైల్వే జోన్‌లో వున్నాయి. తమిళనాడుకు చెందిన చివరి స్టేషన్ అయిన తిరుత్తణికి 15 అర్బన్ రైళ్లు నడుస్తుండగా ఈ స్టేషన్ల మీదుగా రేణిగుంటకు లేక తిరుపతికి అయిదు రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. వ్యాపారాలు, బంధుత్వాల పరంగా రోజూ ఈ స్టేషన్ల నుంచి దాదాపు పదివేల మంది ప్రయాణిస్తుంటారు. ఫలితంగా ప్రధానమైన పుత్తూరు, ఏకాంబకుప్పం స్టేషన్ల నుంచే రోజూ దాదాపు రెండు లక్షల రూపాయల ఆదాయం వస్తోంది.

మనకేదీ ఆటో సిగ్నల్ వ్యవస్థ ?

అటు తమిళనాడుకు చెందిన పొన్‌పాడి స్టేషన్ వరకు ఇటు పూడి వరకు ఆటో సిగ్నల్ వ్యవస్థను అమర్చారు. మధ్యలో వున్న ఈ ఏడు స్టేషన్ల మధ్య మాత్రం ఆటో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు కాలేదు. ఈ ఆటో సిగ్నల్ వల్ల మరో స్టేషన్‌కు రైలు చేరకున్నా ఒకే లైనులో మూడు రైళ్లు కూడా ఒకదాని వెంట మరొకటి నడుస్తుంటాయి. ఫలితంగా స్టేషన్లలో రైళ్లు ఆగే పని లేకుండా పరుగులు తీస్తుంటాయి. అదే పాత వ్యవస్థలో అయితే స్టేషన్‌ను వదిలిన రైలు పక్క స్టేషన్‌కు చేరాకే మరో రైలును పంపాల్సి వచ్చేది. ఈ ఆటో సిగ్నల్ వ్యవస్థ గురించి అటు సదరన్ రైల్వే ఇటు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల ప్రయాణికుల రైళ్లు, గూడ్సు రైళ్ల సంఖ్య పెరగడంతో పాటు వేగం కూడా పెరిగింది కానీ అందుకు అనుగుణంగా లైన్ల విస్తరణ జరగలేదు. బ్రిటిష్ కాలం నాటి రెండు లైన్లు మాత్రమే ఈ ప్రాంతంలో ఇప్పటికీ వుండడం విశేషం. అయితే తమిళనాడులోని తిరుత్తణి వరకు నాలుగు, ఆరు లైన్ల విస్తరణతో రైళ్లు పరుగులు పెడుతుంటాయి.

వందే భారత్‌ను పుత్తూరులో ఆపాలి

రాష్ట్రంలో చివరి స్టేషన్ అయిన పుత్తూరు నుంచి రాజధాని అమరావతిలో , హైకోర్టులో పనుల కోసం ప్రజలు వెళుతుంటారు. ఇక రాజకీయ నాయకుల అనుచరులు పైరవీల కోసం నిత్యం పరుగులు పెడుతుంటారు. వీరందరి కోసం మూడే గంటల వ్యవధిలో రాజధానికి చేరుకునే వందేభారత్ రైలు రోజూ ఉదయం ఆరుగంటలకు పుత్తూరు మీదుగా వెళుతుంది.ఈ రైలును పుత్తూరు స్టేషన్‌లో ఆపితే పదిగంటల కల్లా అమరావతిలో పనులు చేసుకుని అదే రోజు తిరిగి ఇంటికి చేరుకోవచ్చు. ప్రస్తుతం ఈ రైలు తిరువళ్లూరులో మాత్రమే ఆగి తర్వాత రేణిగుంటలో ఆగుతుంది. అలాగే తిరుపతి మీదుగా నడిచే చెన్నై - నెల్లూరు ఫాస్ట్ ప్యాసింజరును కొంత కాలంగా ఆపేశారు. దీని పునరుద్ధరణతో పాటు తిరుత్తణి వరకు వచ్చి ఆగే చెన్నై లోకల్ రైళ్లను రేణిగుంట వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో కలపాలి

అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు గుంతకల్ కేంద్రంగా ఉన్న దక్షిణమధ్య రైల్వే డివిజన్‌లో ఈ ఏడు స్టేషన్లను కలపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. భాష సమస్యతో రాజకీయ నాయకులు కూడా పలుమార్లు చెన్నై వెళ్లి అక్కడి అధికారులను ఒప్పించలేక రైల్వే సమస్యలను పరిష్కరించలేక పోతున్నారు. తిరుపతి ఎంపీ, జిల్లా ఎమ్మెల్యేలు కలిసి గట్టిగా ప్రయత్నిస్తే ఇది అసాధ్యం ఏమీ కాదు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టండి

చిల్లకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలని మండల ప్రత్యేక అధికారి నందకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు సకాలంలో సక్రమంగా అందించాలన్నారు. శనివారం వందశాతం పెన్షన్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ ఇలియాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుమన్, ఈవోపీఆర్‌డీ సిరాజ్, పలు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీహరికోట విద్యార్థి ప్రతిభ



జమ్ములో నిర్వాహకుల నుంచి సర్టిఫికెట్ అందుకొంటున్న విద్యార్థి శ్రీవిష్ యాదవ్

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆఫ్ జమ్ములో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల ఏడో తరగతి విద్యార్థి బిట్రగుంట శ్రీవిష్ యాదవ్ ప్రతిభ కనబరిచాడు. 22 రాష్ట్రాల నుంచి దాదాపు 450 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 15 విభాగంలో శ్రీవిష్ యాదవ్ బ్రాంజ్ మోడల్‌ను కైవసం చేసుకొన్నాడు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి ప్రోత్సాహంతో శ్రీవిష్ యాదవ్ జాతీయ స్థాయిలో రాణించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థి శ్రీవిష్ యాదవ్‌ను ఉపాధ్యాయులు శ్రీనివాసగాంధీ, శిక్షణ ఇచ్చిన సుమిత్ కుమార్ యాదవ్ అభినందించారు.

హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు

గూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేద్దామని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. హెచ్‌ఐవీ వల్ల కలిగే అనర్థాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివరించి చైతన్య పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, విజయ్‌మహేష్, కిరణ్మయి, నారాయణరాజు, వాణి, సురేంద్ర, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

శివుడికి అన్నాభిషేకం



సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివుడికి అన్నాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సునీల్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన అన్నాభిషేక కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కర్లపూడి రమేష్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి...



కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడు, కోటలోని కామాక్షీదేవి సమేత సోమేశ్వరుడి ఆలయాల్లో శుక్రవారం కార్తీకమాస పూజలు జరిగాయి. కోటలోని సోమేశ్వరుడికి అభిషేకాలు చేశారు. స్వామివారి మూల విరాట్‌కు అన్నం, పండ్లు, లడ్డూలతో అభిషేకాలు చేసి అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉదయం విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు వీడ్కోలు పలికారు.

విప్పమానుపట్టెడలో రూ.1.34 కోట్ల దుర్వినియోగం

కలెక్టరేట్‌లో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేష్ ఫిర్యాదు

రేణిగుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని విప్పమానుపట్టెడ పంచాయతీలో కోటీ 34 లక్షల రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయని ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు రాజేష్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారానికి సంబంధించి ఆయన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు. 2022-24 మధ్య పంచాయతీలో అభివృద్ధి నిధులతోపాటు తుడా ప్లాట్లు కొనుగోలు ద్వారా పన్ను రూపంలో పంచాయతీకి రూ.79 లక్షలు వచ్చాయని పేర్కొన్నారు. అయితే సర్పంచ్ ఖాళీ ఓచర్లపై సంతకాలు చేసి రూ.35 లక్షలు పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసినట్లు నిధులు డ్రా చేశారన్నారు. కానీ గతంలో చేసిన పనులపైనే పూతలు పూసి నిధులను దుర్వినియోగం చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీవో చిరంజీవి ఈవోపీఆర్డీ ప్రభురావును విచారణాధికారిగా నియమించారు. వాస్తవాలు ఆయన విచారణలో నిగ్గుతేలాల్సి ఉంది.

పంచాయతీ గదుల వేలంలో సిండికేట్

రేణిగుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ దుకాణాల వేలం సిండికేట్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీ.ఆర్.రావణ ఒక ప్రకటనలో ఆరోపించారు. 15 రోజుల ముందు టెండరు ప్రకటన పత్రికల్లో ఇచ్చిన తర్వాత అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉందన్నారు. అందుకు భిన్నంగా ఎవరికీ తెలియకుండా కార్యాలయ నోటీసు బోర్డులో నోటిఫికేషన్ అంటించి చేతులు దులుపుకోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. టెండర్లలో పోటీదారులకు సాల్వెన్సీ సర్టిఫికేట్ పంచాయతీ కార్యదర్శి ఇవాల్సి ఉందన్నారు. అయితే రూ.లక్షకు పైబడిన ఉంటే తహసీల్దారు వద్ద ఆ సర్టిఫికేట్ తీసుకోవాలని చెప్పడం నిబంధనలను అతిక్రమించడమేనని తెలిపారు. పంచాయతీకి ఆదాయం తీసుకురావాల్సిన అధికారులే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ సమావేశం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో డిసెంబరు 7న జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి తెలిపారు. శుక్రవారం ఉపాధ్యాయులు ఉరందూరులోని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహంలో ఆయనను కలిసి ఆహ్వానించారు. అదే విధంగా గ్రామంలోని పెద్దలు, విద్యావేత్తలను కూడా ఆహ్వానించారు. గ్రామస్తులను కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునీంద్రబాబు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్, మల్లికార్జున, మురళి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో...



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వరదయ్యపాళెం పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశానికి సంబంధించి అధికారులు సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 7వ తేదీ శనివారం పాఠశాలలో మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయాలకు అతీతంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, సమస్యలు, ప్రవర్తన, క్రీడలు, కళలు వంటి వాటిపై సమీక్షించనున్నారు. ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దారు రాజశేఖర్, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకి ఎమ్మెల్యే ఆదిమూలం వీడ్కోలు



పిచ్చాటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తన సోదరుడి కర్మక్రియలు ముగించుకుని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వీడ్కోలు పలికారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న సీఎంను ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలిసి వీడ్కోలు పలికారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



శ్రీకాళహస్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం రెడ్ రిబ్బన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు రంగోలి, డిబెట్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌ను నిర్మూలించలేమని నివారణ ఒకటే మార్గమన్నారు. ఎయిడ్స్ పట్ల యువత సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అధ్యాపకులు శైలజ,సుమతి, నీరజ, మాలతి గాబ్రియేల్, నరసింహారావు, శ్రీకాంత్‌రెడ్డి, సుమతి, అనుజ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తం... ఆకాశదీపం



శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి సతీమణి సుధ, ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధి చెందిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా ఉదయం నిత్య కైంకర్యాలు , ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల కూల్చివేతపై హర్షం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చాలమ్మ కాలనీ వద్ద కేటిరోడ్డు ఆక్రమణలను అధికారులు తొలగించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చాలమ్మ కాలనీలో కొందరు కేటీ రోడ్డు స్థలంను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఈ దుకాణాల ప్రక్కనే పాఠశాల ఉండటంతో దుకాణాలకు వచ్చే కొందరు పోకిరి మూకలు ఆడపిల్లలను అల్లర్లు చేసేవారని, కొందరైతే మద్యం కూడా అమ్మేవారన్నారు. ఆక్రమణాలు తొలగించాలని అమరావతిలోని అధికారులకు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఉన్నాధికారుల ఆదేశాలతో ఆక్రమణలు తొలగించడంతో తహసీల్దార్, ఆర్అండ్‌బీ డీఈ, ఎస్ఐ విశ్వనాథ నాయుడు, ఎంఈవోలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



సత్యవేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంబేడు ఉన్నత పాఠశాలలో తిరుపతి ప్రజా కళా వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు 14 మంది పాల్గొన్నారు. విద్యార్థులలో మాతృభాషపై గౌరవంతో పాటు సాహిత్యం, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలన్న ఉద్దేశంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రజా కళా వేదిక వ్యవస్థాపకుడు అరవ జయపాల్ తెలిపారు. హెచ్ఎం చినబాబు, తెలుగు ఉపాధ్యాయుడు అమర్‌నాథ్, సైన్స్ టీచర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై ఆడిట్

వరదయ్యపాళెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లావాదేవీలపై ఆడిట్ నిర్వహించారు. బ్యాంకు స్టేట్‌మెంట్లు, ఓచర్లు, ఎంబుక్‌లు పరిశీలిస్తున్నట్లు సీనియర్ ఆడిటర్ నరసింహులు తెలిపారు. జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘ నిధుల వివరాలను సరి చూస్తున్నట్లు తెలిపారు

గుంతలమయంగా చేపలమార్కెట్ కూడలి



చేపలమార్కెట్ వద్ద రోడ్డుపై ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చేపల మార్కెట్ కూడలి గుంతలమయమైంది. ముత్యాలమ్మగుడి ఎదురుగా పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రాంతం.. ఐదు రోడ్ల కూడలి కావడంతో ఈ మార్గంలో అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సరిగ్గా ఈ కూడలిలో చేపల మార్కెట్ వెనుక ఉన్న ప్రభుత్వ పాఠశాల నుంచి మార్కెట్ వరకు సుమారు 20మీటర్ల పొడవున రోడ్డు దుస్థితికి చేరుకుంది. అలాగే మార్కెట్ ముందు ప్రధాన రోడ్డుపై పాత ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఒరిగిపోయింది. అది మరింత వాలితే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. నిరుపయోగంగా ఉన్న దిమ్మెను తొలగించడం ద్వారా వాహనదారులకు ఇక్కట్లు తప్పడంతో పాటు రోడ్డు విశాలంగా మారే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చేపలమార్కెట్ కూడలిలో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవోపేతంగా నదీ హారతులు: ఎమ్మెల్యే సుధీర్



నదీ ఏర్పాట్లపై ఈవోతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదీ హారతులను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ చెప్పారు. శుక్రవారం హారతులు జరగనున్న ప్రదేశం, స్నానఘట్టాలు, భిక్షాల గాలిగోపురం, రంగుల గోపురం పరిసరాలను ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ... శనివారం రాత్రి జరిగే స్వర్ణముఖి నది హారతుల మహోత్సవానికి దగ్గరుండి భక్తులకు సౌకర్యాలను కల్పిస్తానన్నారు. ఈ యేడాది భక్తులందరూ వీక్షించేలా నదిలో ప్రత్యేక ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. అలాగే హారతుల సమయంలో మొట్టమొదటి సారిగా ఎల్ఈడీ స్క్రీన్లు, లేజర్‌షో నిర్వహిస్తున్నామన్నారు. ఎస్పీ సుబ్బరాయుడితో మాట్లాడి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, భక్తుల భద్రత కోసం పోలీసు బలగాల నిఘా పెట్టనున్నట్లు తెలిపారు. ఇక స్నాన ఘట్టాలను రానున్న మహాశివరాత్రిలోగా జల వినాయకుడి వంతెన వరకు పూర్తిగా నిర్మిచడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం స్నానఘట్టాల్లో పుణ్యస్నానం ఆచరించే స్థాయిలో నిర్మిస్తామన్నారు. ఇక రాహుకేతు పూజా టిక్కెట్లు ఇచ్చే కౌంటర్లన్నింటినీ రంగుల గోపురంవద్ద శివరాత్రిలోగా మార్పు చేస్తామ న్నారు. అలాగే త్వరలో ఆలయంలో డిజిటల్ లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ భద్రతను మరింత పెంచేందుకు, అసాంఘిక వ్యక్తుల ఆలయ ప్రవేశం అరికట్టేందుకు బార్‌కోడ్ విధానాన్ని అమలు చేయబోతున్నామన్నారు. పారదర్శక పాలనతో ముక్కంటి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, జనసేన నాయకుడు కొట్టె సాయి తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో ప్రముఖులు



శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి

ఏర్పేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని శుక్రవారం పలువురు ఐఏఎస్ అధికారులు సహా శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి దర్శించుకున్నారు. సీఎం పర్సనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రా, సీఎం కార్యాలయ అధికారి హిమాన్షు శుక్లా, తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ కూడా దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు, ఈవో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వారికి వేదపండితులు ఆశీర్వచం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, అధికారులు పాల్గొన్నారు.



దర్శనానంతరం ఐఏఎస్ అధికారులు

బాలికలను ఏడిపిస్తే కఠిన చర్యలు



బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా ఎస్ఐను కోరుతున్న ఎస్ఎంసీ సభ్యులు

కేవీబీపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదివే బాలికలను వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఓబయ్య హెచ్చరించారు. గత కొన్నిరోజులుగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులను కొంతమంది ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై వెంబడించి వేధిస్తున్నట్లు ఎస్ఎంసీ కమిటీ తమకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ క్రమంలో ఉదయం పాఠశాల ప్రారంభం వేళ, సాయంత్రం విడిచే సమయంలో ప్రత్యేకంగా పోలీసులను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

లక్ష్మీనరసింహుడి సేవలో బియ్యపు మధు



శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం పెంచలకోనలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దర్శించుకున్నారు. కార్తీక మాసం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఆలయంలో జరిగిన ప్రత్యేక హోమపూజల్లో పాల్గొన్నారు. శ్రీకాళహస్తీ శ్వరాలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, మున్నారాయల్, జయశ్యాం, శరవణ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య పేడ దిబ్బలు

రోగాల బారిన పడుతున్న ప్రజలు ● పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది



పిచ్చాటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాలకు దూరంగా ఉండాల్సిన పేడ దిబ్బలు జనావాసాల మధ్యనే ఉండడంతో స్థానికులు దుర్వాసనతో పాటూ దోమలతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని కీళపూడి, కారూరు, వెంగళత్తూరు, నీ ర ం వా ం ు ు దళితవాడ, వేలూరు దళితవాడ, కొత్త గొల్లకండ్రిగ, అడవి కండ్రిగలకు చెందిన కొందరు పేడ దిబ్బలను ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడే పోస్తున్నారు. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లడంతో పాటూ దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు సమస్య తీవ్రంగా మారింది. వారం రోజులు ముందు జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచులు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పలు గ్రామాల్లో పశువులను వీధుల్లోని సిమెంటు రోడ్లపైనే కట్టివేస్తున్నారు. ఇటీవల నీరువాయిలో అపారిశుధ్యం ప్రబలడంతో అతిసారం బారిన పడి తిరుపతి రుయాలో చికిత్స పొందిన సంగతి తెలిసిందే. అలాంటి పరిస్థితి మళ్లీ పునరావృత్తం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

రోజంతా చలిగాలులు

సత్యవేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో తూర్పు మండలాల్లో రెండు రోజులుగా ఈదురు, చలి గాలులు తీవ్రంగా వీస్తున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు చలి గాలులతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం తదితర మండలాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు అప్పుడప్పుడు కురవడంతో పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు అవస్థలు పడ్డారు. చలిగాలులు మరో రెండు రోజులు కొనసాగనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో వృద్ధులు, చంటి పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా వర్షాకాలం ప్రారంభమై ఇప్పటి వరకు సక్రమంగా వానలు కురవక ఇబ్బందులు పడుతున్న నియోజకవర్గ రైతాంగం, ఈ తుఫాన్ ప్రభావంతోనైనా వానలు విస్తారంగా కురుస్తాయన్న ఆశాభావంతో ఉన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో...



నీర్పాకోట మిట్ట దళితవాడలో నిలిచి ఉన్న వర్షపు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో చలి గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షాలతో వరినాట్లు వేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలు వేసిన రైతులు రసాయన ఎరువులు వేయడానికి వెనకడుగు వేస్తున్నారు. ఈ నాలుగు రోజులు వర్షం కన్నా గాలులతోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నా భర్తకు వైద్యం చేయించాలి

- వేతన బకాయిలు అందించండి
- అధికారులకు గ్రీన్ అంబాసిడర్ భార్య వినతి



వినతిపత్రం ఇస్తున్న మీరమ్మ

సత్యవేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధ పడుతున్న తన భర్తకు వైద్యం చేయించాలని, ఆయనకు రావాల్సిన బకాయి వేతనాన్ని అందించాలని ఓ గ్రీన్ అంబాసిడర్ భార్య అధికారులకు వినతిపత్రం అందించారు. మండలంలోని ఏఎంపురానికి చెందిన గోపి గతంలో గ్రీన్ అంబాసిడర్‌గా పని చేశాడు. కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో గోపికి వైద్యం చేయించేందుకు డబ్బులు అవసరం ఉందని, తన భర్త గ్రీన్ అంబాసిడర్‌గా పని చేసిన కాలానికి వేతనాన్ని అందించాలని భార్య మీరమ్మ ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ తరుణాక్ష రెడ్డికి వినతిపత్రం అందించారు.

కట్టెల ట్రాక్టర్ బోల్తా

- రాకపోకలకు అంతరాయం



రాగిగుంట వద్ద బోల్తా పడిన కట్టెల ట్రాక్టర్

కేవీబీపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిగుంట వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం కట్టెల ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో రాకపోకలలు స్తంభించాయి. కేవీబీపురం నుంచి శ్రీకాళహస్తి వైపు యూకలిప్టస్ కర్రల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తా పడింది. దీంతో శ్రీకాళహస్తి - పిచ్చా టూరు మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మద్యం స్వాధీనం మహిళ అరెస్టు

రేణిగుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్‌యుపురం సమీపంలో అక్రమ మద్యం కలిగి ఉన్న మహిళను తిరుపతి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. తనిఖీల్లో భాగంగా మహిళ అక్రమంగా మద్యం కలిగి ఉండడాన్ని గుర్తించి మొత్తం 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నరసానాయుడు తెలిపారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎస్ఐ వి. కవీశ్వరనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

రేణిగుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సీఆర్ఎస్ రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరుడిని బిట్రగుంటకు చెందిన రైల్వే ఉద్యోగి శంకరావు పరామర్శించారు. అనంతరం తిరుపతికి ర్యాపిడో బైక్‌లో వెళ్తుండగా ఎర్రంరెడ్డిపాళెంకు చెందిన గని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా శంకరావు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గాజులమండ్యం పోలీసులు తెలిపారు.